నేటి మ్యాచ్‌లు

న్యూజిలాండ్ X పాకిస్థాన్ ఉ. 10.30 నుంచి వేదిక: బెంగళూరు

ఇంగ్లండ్ X ఆస్ట్రేలియా మ. 2.00 నుంచి వేదిక: అహ్మదాబాద్

# అఫ్గాన్ అదుర్స్

## హ్యాట్రిక్ కొట్టిన కాబూలీలు • నెదర్లాండ్స్‌పై ఘనవిజయం

## సెమీస్ ఆశలు సజీవం • మెరిసిన నబీ, హష్మతుల్లా

**ప్రతిష్ఠాత్మక వన్డే ప్రపంచకప్‌లో అఫ్గానిస్థాన్ వరుస విజయాలతో దూసుకెళ్తున్నది. తాజా టోర్నీలో ముగ్గురు మాజీ చాంపియన్లను మట్టికరిపించిన అఫ్గాన్.. నెదర్లాండ్స్‌ను చిత్తుచేసి హ్యాట్రిక్ కొట్టింది. మొదట స్పిన్నర్ల ముప్పేట దాడికి తోడు అనవసర రనౌట్‌లు డచ్ జట్టును నిండా ముంచితే.. ఆనక అఫ్గాన్ బ్యాటర్లు బాధ్యతాయుతంగా ఆడి జట్టును గెలిపించారు. ఈ దెబ్బతో అఫ్గాన్ సెమీస్ అవకాశాలు మెరుగవగా.. నాకౌట్ బెర్త్‌పై భారీ ఆశలు పెట్టుకున్న పాకిస్థాన్ సంకట స్థితిలో పడింది!**




నబీ (3/28)

లక్నో: స్పిన్‌కు సహకరిస్తున్న పిచ్‌పై సమిష్టిగా సత్తాచాటిన అఫ్గానిస్థాన్ వన్డే ప్రపంచకప్‌లో నాలుగో విజయం ఖాతాలో వేసుకుంది. శుక్రవారం జరిగిన పోరులో అఫ్గాన్ 7 వికెట్ల తేడాతో నెదర్లాండ్స్‌ను చిత్తుచేసింది. ఏడు మ్యాచ్‌ల్లో అఫ్గాన్‌కు ఇది నాలుగో విజయం కాగా.. 8 పాయింట్లు ఖాతాలో వేసుకున్న ఆ జట్టు పాకిస్థాన్ (7 మ్యాచ్‌ల్లో మూడు విజయాలతో 6 పాయింట్లు)ను వెనక్కి నెట్టి పట్టికలో ఐదో స్థానానికి ఎగబాకింది. మరోవైపు ఏడు మ్యాచ్‌ల్లో నెదర్లాండ్స్ ఐదో పరాజయం మూటగట్టుకుంది. టాస్ గెలిచి మొదట బ్యాటింగ్‌కు దిగిన నెదర్లాండ్స్ 46.3 ఓవర్లలో 179 పరుగులకు ఆలౌటైంది. ఇంగిల్‌బెర్త్ (58; 6 ఫోర్లు), మ్యాక్స్ ఓ డౌడ్ (42; 9 ఫోర్లు) రాణించారు. ఒక దశలో 73 పరుగులకు ఒకే వికెట్ మాత్రమే కోల్పోయి పటిష్ట స్థితిలో కనిపించిన డచ్ జట్టును.. రనౌట్‌లు దెబ్బకొట్టాయి. లక్నో పిచ్ స్పిన్‌కు సహకరిస్తున్న నేపథ్యంలో ఈ మ్యాచ్‌లో అఫ్గాన్ నలుగురు స్పిన్నర్లను బరిలోకి దింపింది. నబీ మూడు వికెట్లు పడగొట్టగా.. నూర్ అహ్మద్ రెండు వికెట్లు తీశాడు. టాప్-5లో నలుగురు బ్యాటర్లు రనౌట్ కావడం డచ్ జట్టు కొంపముంచింది. అనంతరం స్వల్ప లక్ష్యఛేదనలో అఫ్గానిస్థాన్ 31.3 ఓవర్లలో 3 వికెట్లు కోల్పోయి 181 పరుగులు చేసింది. కెప్టెన్ హష్మతుల్లా షాహిది (56 నాటౌట్; 6 ఫోర్లు), రహ్మత్ షా (52; 8 ఫోర్లు), అజ్మతుల్లా ఒమర్‌జాయ్ (31 నాటౌట్) సత్తాచాటారు. మరో 111 బంతులు మిగిలుండగానే లక్ష్యాన్ని ఛేదించిన అఫ్గాన్ రన్‌రేట్ మెరుగుపరుచుకోవడంతో పాటు.. ఐసీసీ చాంపియన్స్ ట్రోఫీకి తొలిసారి అర్హత సాధించింది. నబీకి 'మ్యాన్ ఆఫ్ ది మ్యాచ్' అవార్డు దక్కింది.

### సంక్షిప్త స్కోర్లు

**నెదర్లాండ్స్:** 46.3 ఓవర్లలో 179 (ఇంగిల్‌బెర్త్ 58; మ్యాక్స్ ఓ డౌడ్ 42; నబీ 3/28, నూర్ అహ్మద్ 2/31), **అఫ్గానిస్థాన్:** 31.3 ఓవర్లలో 181/3 (హష్మతుల్లా 56, రహ్మత్ షా 52; సాఖిబ్ 1/25).

### సెమీస్ చేరాలంటే..

ప్రపంచకప్‌లో ఆడిన ఏడు మ్యాచ్‌ల్లో నాలుగింట విజయాలు సాధించిన అఫ్గానిస్థాన్.. సెమీఫైనల్‌కు చేరాలంటే.. మిగిలిన రెండు మ్యాచ్‌ల్లో ఆస్ట్రేలియా, దక్షిణాఫ్రికాపై విజయాలు సాధించాలి. అదే జరిగితే అఫ్గాన్ 12 పాయింట్లతో ముందంజ వేస్తుంది. ఒక వేళ ఓడినా అవకాశం ఉన్నా అది మిగిలిన జట్ల ఫలితాలపై ఆధారపడి ఉంది. ఎటొచ్చి నెదర్లాండ్స్‌పై అఫ్గాన్ విజయం పాకిస్థాన్ అవకాశాలను మరింత సంక్లిష్టం చేసింది. ఇప్పుడా జట్టు ముందంజ వేయాలంటే అద్భుతం జరగాల్సిందే.

"సెమీఫైనల్ చేరేందుకు తీవ్రంగా ప్రయత్నిస్తున్నాం. అది జరిగితే మా దేశ క్రికెట్‌లో గొప్ప ఘనత సాధించినట్లు అవుతుంది. మూడు నెలల క్రితం మా అమ్మ చనిపోయింది. ఆ బాధను దిగమింగి వరల్డ్‌కప్ ఆడుతున్నా. మా దేశంలో చాలా మంది పరిస్థితి ఇంతకన్నా ఘోరంగా ఉంది. వారందరికీ ఈ విజయాన్ని అంకితమిస్తున్నాం. వరుసగా మూడో మ్యాచ్‌లో విజయవంతంగా లక్ష్యాన్ని ఛేదించడం ఆనందంగా ఉంది. నబీ స్పెషల్ ప్లేయర్. జట్టుకు అవసరమైన సమయంలో నేనున్నానంటూ బాధ్యత భుజానెత్తుకుంటాడు.

**-హష్మతుల్లా షాహిది, అఫ్గానిస్థాన్ కెప్టెన్**

### ప్రపంచ కప్ పాయింట్ల పట్టిక

| దే | ఆ | గె | ఓ | ర.రే. | పా |
|---|---|---|---|---|---|
| భారత్ ✓ | 7 | 7 | 0 | +2.10 | 14 |
| దక్షిణాఫ్రికా | 7 | 6 | 1 | +2.29 | 12 |
| ఆస్ట్రేలియా | 6 | 4 | 2 | +0.97 | 8 |
| న్యూజిలాండ్ | 7 | 4 | 3 | +0.48 | 8 |
| అఫ్గానిస్థాన్ | 7 | 4 | 3 | -0.33 | 8 |
| పాకిస్థాన్ | 7 | 3 | 4 | -0.02 | 6 |
| శ్రీలంక | 7 | 2 | 5 | -1.16 | 4 |
| నెదర్లాండ్స్ | 7 | 2 | 5 | -1.39 | 4 |
| బంగ్లాదేశ్ X | 7 | 1 | 6 | -1.44 | 2 |
| ఇంగ్లండ్ | 6 | 1 | 5 | -1.65 | 2 |

నోట్: దే: దేశం, ఆ: ఆడినవి, గె: గెలిచినవి, ఓ: ఓడినవి, ర: రన్‌రేట్, పా: పాయింట్స్

# ప్రితి పాంచ్ పటాకా



ప్రితి

పనాజీ: గోవా వేదికగా జరుగుతున్న 37వ జాతీయ గేమ్స్‌లో తెలంగాణ యువ స్విమ్మర్ ప్రితి అగర్వాల్ పతకాల వేట కొనసాగుతున్నది. బరిలోకి దిగిన ప్రతీ ఈవెంట్‌లో కచ్చితంగా పతకం ఖాతాలో వేసుకుంటున్న ప్రితి తన జోరు కొనసాగిస్తున్నది. శుక్రవారం జరిగిన మహిళల 400మీటర్ల ఫ్రీస్టయిల్ ఈవెంట్‌లో ప్రితి 4:30:03 టైమింగ్‌తో రెండో స్థానంతో రజతం సొంతం చేసుకుంది. భవ్య సచ్‌దేవ్(4:27:93, ఢిల్లీ), శిరిణ్(4:34:74, కర్నాటక) వరుసగా స్వర్ణ, కాంస్య పతకాలు కైవసం చేసుకున్నారు. ఇదిలా ఉంటే టెన్నిస్ మహిళల డబుల్స్ సెమీస్‌లో శ్రీవల్లి రష్మిక, శ్రావ్య శివానీ జోడీ 6-4, 6-7(5), 10-5తో శర్మద బాలు, సోహా సాదిక్ ద్వయంపై గెలిచి ఫైనల్లోకి ప్రవేవించింది. సింగిల్స్ క్వార్టర్స్‌లో రష్మిక 6-0, 6-3తో సుహిత(కర్నాటక)పై గెలిచి సెమీస్‌లోకి దూసుకెళ్లింది.

# చావో రేవో!

## నేడు న్యూజిలాండ్‌తో పాకిస్థాన్ ఢీ



బాబర్

బెంగళూరు: వన్డే ప్రపంచకప్‌లో మరో కీలక సమరానికి సమయం ఆసన్నమైంది. సెమీ ఫైనల్ రేసులో నిలువాలంటే తప్పక గెలువాల్సిన మ్యాచ్‌లో న్యూజిలాండ్‌తో పాకిస్థాన్ అమీతుమీ తేల్చుకోనుంది. నెదర్లాండ్స్‌పై అఫ్గానిస్థాన్ విజయం సాధించడంతో.. పాకిస్థాన్ ముందంజ వేయడం మరింత కష్టంగా మారిన తరుణంలో ఈ మ్యాచ్‌లో భారీ తేడాతో నెగ్గి రెండు పాయింట్లు ఖాతాలో వేసుకోవడంతో పాటు రన్‌రేట్ మెరుగు పర్చుకోవాలని పాక్ భావిస్తున్నది. మరోవైపు న్యూజిలాండ్ గాయాలతో సతమతమవుతున్నది. రెగ్యులర్ కెప్టెన్ కేన్ విలియమ్సన్‌తో పాటు నీషమ్, చాప్‌మన్, హెన్రీ సేవలను ఆ జట్టు కోల్పోయింది. గత మూడు మ్యాచ్‌ల్లో పరాజయాలు ఎదుర్కొన్న కివీస్.. పాక్‌పై ఎలాంటి ప్రదర్శన చేస్తుందనేది ఆసక్తికరం. ఇప్పటివరకు ఆడిన ఏడు మ్యాచ్‌ల్లో నాలుగింట నెగ్గిన న్యూజిలాండ్ పాయింట్ల పట్టికలో నాలుగో స్థానంలో ఉంటే.. మూడు గెలిచిన పాకిస్థాన్ ఆరో ప్లేస్‌లో ఉంది.

## హెన్రీ ఔట్

న్యూఢిల్లీ: న్యూజిలాండ్ ఏస్ పేసర్ మ్యాట్ హెన్రీ వన్డే ప్రపంచకప్‌నకు దూరమయ్యాడు. దక్షిణాఫ్రికాతో మ్యాచ్ సందర్భంగా గాయపడ్డ హెన్రీ నాలుగు వారాల పాట ఆటకు దూరం కావాల్సిందేనని వైద్యులు తెలపడంతో.. అతడి స్థానంలో న్యూజిలాండ్ పేస్ ఆల్‌రౌండర్ కైల్ జెమీసన్‌ను ఎంపిక చేసుకుంది. ఆరున్నర అడుగుల ఆజానుభావుడైన జెమీసన్ గురువారమే జట్టుతో చేరగా.. పాక్‌తో మ్యాచ్‌లో అతడు బరిలోకి దిగే చాన్స్ ఉంది.

## శ్రీనిధి గెలుపు జోరు

హైదరాబాద్, ఆట ప్రతినిధి: ప్రతిష్ఠాత్మక ఐ-లీగ్‌లో శ్రీనిధి దక్కన్ ఫుట్‌బాల్ క్లబ్(ఎస్‌డీఎఫ్‌సీ) గెలుపు జోరు కొనసాగుతున్నది. శుక్రవారం దక్కన్ ఎరీనాలో జరిగిన మ్యాచ్‌లో శ్రీనిధి ఎఫ్‌సీ 4-1తో ఇంటర్ కాశిపై ఘన విజయం సాధించింది. పూర్తి స్థాయి ఆధిపత్యం ప్రదర్శించిన మ్యాచ్‌లో శ్రీనిధి తరఫున గాబ్రియెల్, పవన్‌కుమార్, లాల్‌తులంగ, లాల్‌బైకలినా గోల్స్ చేయగా, మారియో బార్కో..ఇంటర్ కాశీకి ఏకైక గోల్ అందించాడు.



## శ్రీవారి సేవలో పంత్, అక్షర్

హైదరాబాద్, నవంబర్ 3 (నమస్తే తెలంగాణ): తిరుమల శ్రీవారిని భారత క్రికెటర్లు రిషబ్‌పంత్, అక్షర్‌పటేల్ దర్శించుకొన్నారు. గురువారం రాత్రి వీఐపీ విరామ సమయంలో స్వామివారికి మొక్కులు చెల్లించుకొన్నారు. అనంతరం రంగనాయక మండపంలో రిషబ్ పంత్, అక్షర్ పటేల్‌కు ఆశీర్వాదం, తీర్థ ప్రసాదాలను అర్చకులు అందజేశారు.

## పొట్టి ప్రపంచకప్‌లో నేపాల్, ఒమన్

ఖాట్మండు: వచ్చే ఏడాది వెస్టిండీస్, అమెరికా సంయుక్తంగా ఆతిథ్యమిస్తున్న టీ20 ప్రపంచకప్‌నకు ఆసియా నుంచి నేపాల్, ఒమన్ అర్హత సాధించాయి. ఆసియా క్వాలిఫయింగ్ టోర్నీలో ఫైనల్ చేరడం ద్వారా ఈ రెండు జట్లు పొట్టి ప్రపంచకప్ బరిలోకి దిగే అవకాశం దక్కించుకున్నాయి. శుక్రవారం జరిగిన సెమీఫైనల్స్‌లో ఒమన్ 10 వికెట్ల తేడాతో బహ్రెయిన్‌ను మట్టికరిపిస్తే.. నేపాల్ 8 వికెట్ల తేడాతో యూఏఈని చిత్తుచేసి ముందంజ వేసింది.

## ఐపీఎల్‌లోకి సౌదీ యువరాజు

రియాద్: ప్రపంచంలోనే అత్యంత విలువైన క్రికెట్ లీగ్‌గా పేరొందిన ఐపీఎల్‌పై సౌదీఅరేబియా యువరాజు కన్నేశాడు. లీగ్‌లో ఎలాగైనా ఫ్రాంచైజీని కొనుగోలు చేయాలన్న పట్టుదలతో ఉన్న యువరాజు మహమ్మద్ బిన్ సల్మాన్ ఆ దిశగా ప్రయత్నిస్తున్నట్లు తెలిసింది. గత సెప్టెంబర్లో భారత పర్యటనకు వచ్చిన సల్మాన్..భారత ప్రభుత్వంతో చర్చలు జరిపినట్లు బ్లూమ్‌బర్గ్ తమ కథనంలో పేర్కొంది.




